కోడి పోరుకు బరులు సిద్ధం

- మామిడి తోటల్లో బరుల ఏర్పాటు
- పేకాట శిబిరం ఏర్పాటు చేసే తోటకు రోజుకు రూ.లక్ష అద్దె
- ముందే బుక్ అయిన ఫంక్షన్ హాళ్లు, గదులు



పెనుగంచిప్రోలులో కోడిపందేలకు సిద్ధమవుతున్న మామిడి తోట

పెనుగంచిప్రోలు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడి పందేలు నిర్వహణకు పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని మునేరు పక్కన మామిడి తోటలు సిద్ధమవుతున్నాయి. పోలీస్, రెవెన్యూ అధికారులు కోడి పందేలు, పేకాటతో పాటు పలు జూదాలు ఆడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేస్తున్నా కూటమి నాయకులు మాత్రం అట్టహాసంగా పందేల నిర్వహణకు తోటల్లో బరులు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణ సరిహద్దులో ఉండటంతో పెద్ద సంఖ్యలో పందెం రాయుళ్లు హాజరవుతారని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా పెనుగంచిప్రోలులో, వత్సవాయి మండలంలోని లింగాల, వత్సవాయితో పాటు మంగొల్లు గ్రామాల్లో పోటీల నిర్వహణకు నాయకులు ఉత్సాహంగా ఉన్నారు. మునేరు పక్కన మామిడి తోటల్లో కోడి పందేలతో పాటు గుండాట, కోత ముక్క, పలు రకాల జూదాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్కడే బిరియానీ, టిఫిన్లు, ఇతర తినుబండారాలతో పాటు డ్రింక్స్, వాటర్ సదుపాయాల నిర్వహణకు కూడా నిర్వాహకులు సొమ్ము వసూలు చేయనున్నారు.

మామిడి తోటకు రోజుకు రూ.లక్ష అద్దె

పెనుగంచిప్రోలులో మునేరు అవతల ఫంక్షన్ హాళ్లలో పెద్ద ఎత్తున పేకాట శిబిరంతో పాటు తోటల్లో కోడి పందేలు నిర్వహించనుండటంతో ఫంక్షన్‌హాళ్లు, గదులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో ముందస్తుగా నిర్వాహకులు వాటిని బుకింగ్ చేసుకున్నారు. పేకాట శిబిరానికి ఒక తోటను మూడు రోజులకు రూ.3 లక్షలకు బుకింగ్ చేశారని అంటున్నారు. సుమారు 100 ఏసీ గదులు ఒకొక్కటి రూ.1000 నుంచి రూ.1500 కు బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. చుట్టుపక్కల పందెం రాయుళ్లు కూడా ఆహ్లాదకర వాతావరణం ఉండే పెనుగంచిప్రోలులో బస చేసేందుకు ఇష్టపడటమే ఈ డిమాండ్‌కు కారణంగా చెబుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

బరులు ఏర్పాటు చేస్తున్న మామిడి తోటల్లో ట్రాక్టర్‌తో దున్నేశాం. జూదాలు, కోడి పందేలు లేదా ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అనుమతించకూడదని ఫంక్షన్‌హాళ్ల యజమానులకు నోటీసులు ఇచ్చాం. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

-ఎంఎస్‌కే అర్జున్, ఎస్‌ఐ, పెనుగంచిప్రోలు

క్లుప్తంగా

నేడు పరిటాలకు మంత్రి రాక

కంచికచర్ల: మండలంలోని పరిటాలలో శనివారం ప్రభుత్వం నిర్వహించనున్న 'పల్లె పండుగ' కార్యక్రమంలో గోకులం షెడ్లను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభిస్తారని ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా, మండలస్థాయి అధికారులు పాల్గొనాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు



నవాబుపేట(పెనుగంచిప్రోలు): కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జగ్గయ్యపేట సీఐ పి. వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని నవాబుపేట గ్రామంలో పందేలు వేసేందుకు అనుమానం ఉన్న ప్రదేశాల్లో ట్రాక్టర్ గొర్రుతో దున్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరపకూడదని, పండుగలు సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలన్నారు. అనంతరం పందేలు నిర్వహించకూడదని పలువురికి నోటీసులు అందజేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఎ. శాంతిలక్ష్మి, ఎస్ఐ అర్జున్ పాల్గొన్నారు.

కోడి పందేల బరులు ధ్వంసం



నందిగామ టౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు, జూదం, తదితర అసాంఘిక క్రీడలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని సీఐ వైవీఎల్ నాయుడు, తహసీల్దార్ సురేష్‌బాబు హెచ్చరించారు. మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన కోడి పందేల బరిని శుక్రవారం అధికారులు తొలగించారు. వారు మాట్లాడుతూ కోడి పందేలకు అనుమతులు లేవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కోడి పందేల బరులు ఏర్పాటు చేసినా, పందేలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బరిలో ఏర్పాటు చేసిన సిమెంట్ పోల్స్‌ను తొలగించి బరిని ట్రాక్టర్‌లతో దున్ని ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: మండలంలోని షేర్‌మహ్మద్‌పేట గ్రామంలో కోడి పందేల బరులను శుక్రవారం ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ ట్రాక్టర్‌తో ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో కోడి పందేలు, జూదం, గుండాట, అశ్లీల నృత్యాలు, తదితరాలను నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి పోటీల నిర్వహణ

కంచికచర్ల: చందర్లపాడు మండలం తోటరావులపాడు గ్రామంలో ఈనెల 14వ తేదీ ఉదయం 10గంటల నుంచి యువతీ, యువకులకు పలు విభాగాల్లో ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.2 వేలు, రెండో బహుమతి రూ.1500, మూడో బహుమతి రూ.1000 ఇస్తామన్నారు. ఎంట్రీ ఫీజు రూ.50 చెల్లించాలన్నారు. ఈనెల 15న ఉదయం 11గంటలకు ట్రాక్టర్ రివర్స్, బైక్ స్లో, మోకు లాగుడు పోటీలు ఉంటాయి. 16న ఉదయం 11గంటల నుంచి చిన్న పిల్లలకు మ్యూజికల్ చైర్స్, పరుగు పందెం, స్కిప్పింగ్, డ్యాన్స్ పోటీలు ఉంటాయి. 14న సాయంత్రం సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం ప్రదర్శన, 16న 'దేవనర్తకి' సందేశాత్మక పూర్తి నాటకం ప్రదర్శన ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

గోకులం షెడ్డు ప్రారంభం



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామంలో 'పల్లెపండుగ' కార్యక్రమంలో భాగంగా నిర్మించిన గోకులం షెడ్డును శుక్రవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో గోకులం షెడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత నిస్తుందన్నారు. ఉపాధి హామీ పథకం కింద రాయితీపై షెడ్ల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. చిల్లకల్లు గ్రామంలో నిర్మించిన గోకులం షెడ్డు, సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఎంపీడీవో నితిన్, ఏపీఎం రామకృష్ణ, నాయకులు కట్టా వెంకట నరసింహారావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

నందిగామ టౌన్: మండలంలోని ఆయా గ్రామాల్లో సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆకుల హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాలు అభివృద్ధి పథంలో సాగుతాయన్నారు. కొణతమాత్మకూరు సర్పంచ్ మేడా కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ఇండెంట్‌లు ముగియటంతో ఆన్‌లైన్ ప్రక్రియ ఆగిందని ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గోళ్లమూడి పీహెచ్‌సీ పరిధిలోని కమ్మవారిపాలెం, జొన్నలగడ్డ గ్రామాలకు ఆశావర్కర్‌లను నియమించాలని పలువురు ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా సమస్యలను పరిష్కరించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆర్‌అండ్‌బీ, విద్యుత్, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్, పలు ప్రధాన శాఖల అధికారులు హాజరకాకపోవటంపై వైస్ ఎంపీపీ అన్నం పిచ్చయ్య అసంతృప్తి వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులపై చర్యలకు ఉన్నతాధికారులకు సిఫారసు చేయాలని ఎంపీడీవోను కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ పద్మజ్యోతి, డెప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకట్రావమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు



వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏసీపీ తిలక్

కంచికచర్ల: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో యువతకు వాలీబాల్ పోటీలు స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను నందిగామ సబ్ డివిజన్ ఏసీపీ ఏ బాలగంగాధర్ తిలక్ ప్రారంభించారు. ఈ మేరకు ఏసీపీ మాట్లాడుతూ విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో కంచికచర్లలోని మిక్ ఇంజినీరింగ్ కళాశాల, ఎంవీఆర్, అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో జట్లతో పాటు మండలంలోని గండేపల్లి, వీరులపాడు మండలంలోని జమ్మవరం మొత్తం ఎనిమిది టీంలు పాల్గొన్నాయని తెలిపారు. వాలీబాల్‌లో మంచి ప్రతిభ కనపర్చిన ఎంవీఆర్ జట్టు మొదటి బహుమతి, జమ్మవరం జట్టు ద్వితీయ బహుమతి, గండేపల్లి జట్టు తృతీయ బహుమతులు గెలుచుకున్నాయని మిక్ కళాశాల పీడీ నిమ్మగడ్డ శౌరయ్య తెలిపారు. ఏసీపీ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. నందిగామ రూరల్ సీఐ, నందిగామ సీఐలు డీ చవాన్, ఎంవీ నాయుడు, ఎస్ఐ రాజు, పీడీలు గోపాలరావు, శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూళ్లలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



భోగిమంటలు వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు

కంచికచర్ల: పలు పాఠశాలలు, కళాశాలల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక అక్షర స్కూల్,ఉషోదయ స్కూల్, సంస్కృతి స్కూల్, గౌతమి స్కూళ్లలో సంక్రాంతి వేడుకలు జరిగాయి. తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా సంబరాలు జరుపుకున్నారు. ముందుగా భోగి మంటలు వేశారు. పాయసం వండారు. గొబ్బెమ్మలు పెట్టి పాటలు పాడారు.రంగోలి పోటీలు నిర్వహించారు.పండుగ గురించి విద్యార్థులకు వివరించారు. ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు కాస రగడ్డ రామారావు,కుర్రా కిరణ్‌కుమార్, ఎం.రమేష్, అబ్బూరి రామారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి వేడుక

పెనుగంచిప్రోలు: గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గులు వేయటంతో పాటు చిన్నారులకు భోగిమంటలు, హరిదాసు వేషాలు వేశారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక చిరునగర్‌లో ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. టీడీపీ అంగన్‌వాడీ, డ్వాక్రా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఆచంట సునీత, ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం డివిజన్ లీగల్ అడ్వయిజర్ జూనెబోయిన శ్రీనివాసరావు విజేతలకు బహుమతులను అందజేశారు. మానవహక్కుల సంఘం ప్రతినిధి వల్లాపురపు వెంకటబాబు, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు షేక్ నజీమున్, మానవ హక్కుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సునీత, శ్రీనివాసరావు తదితరులు

న్యాయవాదుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జగ్గయ్యపేట అర్బన్: పొన్నూరు న్యాయవాది బేతాళ ప్రకాశరావును పొన్నూరు పట్టణ పోలీసులు కొట్టిన సంఘటనపై జగ్గయ్యపేట న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సుందరరావు మాట్లాడుతూ మా న్యాయవాదిపై పోలీసులు థర్డ్ డిగ్రీ ఉపయోగించే అధికారం ఎవరిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. న్యాయవాదులు ఈవీ.జగన్నాథరావు, జూనెబోయిన శ్రీనివాసరావు, బూడిద నరసింహారావు, శ్రీనివాసగౌడ్, జంగా నరసరాజు, లక్ష్మీనారాయణ, కృష్ణంరాజు, ప్రతాపరెడ్డి, ఆది, నరేష్, రాజశేఖర్, రాజు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై సంక్రాంతి రద్దీ



కీసర టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన కార్లు, ఇతర వాహనాలు

కీసర(కంచికచర్ల): ఇతర రాష్ట్రాలలో నివసించే ఆంధ్రప్రాంత ప్రజలు శుక్రవారం కార్లు, ఇతర వాహనాలలో సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు బయలుదేరారు. కంచికచర్ల మండలంలోని కీసర టోల్ ప్లాజా వద్ద ప్లాజా నిర్వాహకులు ఐదు కౌంటర్లు ఏర్పాటు చేశారు. దీనికి తోడు ఫాస్టాగ్ సిస్టం ఉండటంతో వాహనాలన్నీ ఆగకుండా వెళ్లుతున్నాయి. శుక్రవారం 20 వేల వాహనాలు హైద్రాబాద్ వైపు నుంచి విజయవాడ వైపునకు తరలి వెళ్లాయని ప్లాజా మేనేజర్ జయ ప్రకాష్ తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి ఈ ఏడాది ఎక్కువ మంది ప్రయాణికులు వస్తున్నారు. ప్లాజా వద్ద వాహనాలు నిలబడకుండా ఉండేందుకు ఫాస్టాగ్ ఏర్పాటు చేయటంతో వాహనాలు తక్కువ సమయంలో తరలివెళ్లుతున్నాయని మేనేజర్ తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



బోరు పంపు ఏర్పాటు పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ లక్ష్మి

పెద్దాపురం(వీరులపాడు): ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని శ్మశానవాటికలో మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేస్తున్న బోరు పంపు నిర్మాణ పనులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వేసవి కాలం దృష్ట్యా ఆయా గ్రామాల్లో 30 బోరు పంపుల ఏర్పాటుకు మండల పరిషత్ నుంచి రూ.30 లక్షల నిధులు మంజూరు చేశామన్నారు. బోరు పంపులు, తదితర అభివృద్ధి పనులకు మండల పరిషత్ నుంచి రూ. 63.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, మాజీ సర్పంచ్ ఆవుల మాధవి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, సొసైటీ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణ రెడ్డి, గ్రామస్తులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ముక్కోటి పూజలు



పేటలో కొరాయి ఉత్సవంలో ఉత్సవ విగ్రహాల రథాలు

నందిగామ టౌన్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆయా గ్రామాల్లోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతారామాంజనేయ స్వామి, కల్యాణ వేంకటేశ్వర స్వామి, చెన్నకేశవ స్వామి, తదితర ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామి వార్లను దర్శించుకున్నారు. పట్టణంలోని సీతారామచంద్ర స్వామి, వేంకటేశ్వర స్వామి, ముక్కోటి మహా మండపంలోని చెన్నకేశవ స్వామి, తదితర ఆలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచే బారులు తీరి స్వామి వారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకున్నారు. ముందుగా విశేష పూజలు, అభిషేకాలు చేశారు.

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవార్ల ఉత్సవమూర్తులు భక్తులకు ఉత్తర ద్వారం నుంచి దర్శనం కల్పించారు. ముందుగా ఆలయ ఈవో జంగాల శ్రీనివాసరావు దంపతులు, ఈఈ ఎల్ రమ, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఉమాపతి, పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, ప్రధానాలయంలో పూజలు నిర్వహించారు. ముక్కోటిని పురస్కరించుకొని గురువారం రాత్రి ఆలయం వద్ద అమ్మవారి దీక్షాస్వాములచే భజన కార్యక్రమం, జాగరణ చేశారు. స్వాములకు అల్పాహారం ఏర్పాటు చేశారు. శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, పలు ప్రముఖ ఆలయాల్లో దేవతామూర్తులు ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిచ్చారు.

వత్సవాయి: మండలంలో గ్రామాల్లోని రామాలయాలు, వేణుగోపాలస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాల వద్దకు చేరుకుని స్వామివారి దర్శనాన్ని చేసుకున్నారు. ముక్కోటి సందర్భంగా స్వామివారు భక్తులకు ఉత్తరద్వారంగా దర్శనమిచ్చారు. చిట్టేల వెంకటేశ్వరస్వామి, మక్కపేటలో పట్టాభిరామచంద్ర స్వామి, రాజగోపాల, వేణుగోపాల, ద్వాదశ జ్యోతిర్లింగ అయ్యప్ప స్వామి ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. మంగొల్లు, వత్సవాయి, భీమవరం, దబ్బాకుపల్లి, పోలంపల్లి తదితర గ్రామాలలోని రామాలయాలు భక్తులతో నిండిపోయాయి.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో శుక్రవారం కొరాయి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. బలుసుపాడు రోడ్డులో ఉన్న పాత వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి సాగిన పొన్న వాహన సేవ పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ముక్త్యాల రోడ్డులోని బంగారు కొట్ల సెంటర్‌లో ఉన్న విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రతిఏటా నిర్వహించే కొరాయి ఉత్సవానికి వివిధ ఆలయాలకు చెందిన దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలకు నగరోత్సం నిర్వహించారు. శ్రీరంగనాయకస్వామి ఆలయం, శ్రీమహాలక్ష్మి వెండిదేవాలయం అమ్మవారు, మార్కండేయస్వామి ఆలయం, వరద రాజస్వామివారి ఆలయం, చెన్నకేశవస్వామి ఆలయం, శ్రీధనశైలి శ్రీసీతారామస్వామి ఆలయం, కొత్త వెంకటేశ్వరస్వామి ఆలయాలలో ఉత్తర ద్వార దర్శనాలు ఏర్పాటు చేశారు. రథాలపై నగరోత్సవం నిర్వహించారు.

జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి వేదాద్రి గ్రామాలలోని వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి, యోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే స్వామి వార్లు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం అందించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేక రథంపై ఊరేగించారు. ఆలయ ఏసీ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. గరుడసేవ నిర్వహించారు. ఈవో సురేష్‌బాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



నందిగామలో చెన్నకేశవ స్వామిని ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు



పెనుగంచిప్రోలులో పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు, అధికారులు

కంచికచర్ల: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారికి హారతులు, ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పరిటాల, గొట్టుముక్కల, మున్నలూరు, కునికెనపాడు, మోగులూరు, పెండ్యాల, కీసర గండేపల్లి, పేరకలపాడు తదితర గ్రామాల్లో భక్తులు ఆలయాలకు తెల్లవారుజామునే చేరి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారి రథోత్సవం



పెనుగంచిప్రోలు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం అనంతరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారి ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించిన రథంపై గ్రామంలో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి ప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈఈ ఎల్.రమ, ఏఈఓ ఉమాపతి, తిరుమలేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు పాలాది వెంకటరమణ, బెజవాడ శ్రీనివాసరావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కంచికచర్ల వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు



వేదాద్రిలో ఉత్తర ద్వార దర్శనమిస్తున్న నరసింహ స్వామి వారు

రైతులకు న్యాయం చేయాలి

వీరులపాడు: రైల్వేలైన్ కింద భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువకు నాలుగు రెట్లు నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పగడాల వీరాంజనేయులు పేర్కొన్నారు. రైల్వేలైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు, వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ మండలంలోని ఆయా గ్రామాలలో శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి రైల్వేలైన్ ఏర్పాటుకు కంచికచర్ల, వీరులపాడు మండలాల పరిధిలో వందల ఎకరాల సాగు భూములు తీసుకునేందుకు ప్రభుత్వ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలని లేకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట కళ్యాణ్, చనుమోలు సైదులు, చాట్ల రవి, లాల్ అహ్మద్ గౌస్, పత్తిపాటి మల్లేశ్వరరావు, మందూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



19వ వార్డులో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

నందిగామ టౌన్: జనరల్ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.01 కోట్లతో పట్టణంలోని పలు వార్డులలో చేపడుతున్న అభివృద్ధి పనులకు శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలోని పలు వార్డులలో మంచి నీటి పైపులైన్ మరమ్మతులు, బీటీ రోడ్డు, సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి, కమిషనర్ రమణబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన



మాట్లాడుతున్న మేనేజర్ మురళీకృష్ణ

జగ్గయ్యపేట: సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్‌లపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌బీఐ మేనేజర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని బ్యాంకు శాఖలో శుక్రవారం డిజిటల్ పేమెంట్స్, సైబర్ నేరాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు సిబ్బంది వినియోగదారులను ఎటువంటి ఓటీపీలు అడగరన్నారు. ఎవరైనా ఫోన్ చేసి పలు రకాల అప్‌డేట్‌ల నిమిత్తం ఓటీపీ చెప్పాలని అడిగితే చెప్పవద్దని తెలిపారు. ఇటీవల కాలంలో డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో మోసాలు జరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.